క్లుప్తంగా

నిర్మల్‌రూరల్ సీఐగా రామకృష్ణ


సీఐకి అభినందనలు తెలుపుతున్న ఎస్సైలు

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ నూతన సీఐగా ఎస్.రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేసిన శ్రీనివాస్ కాగా.. నూతన సీఐ మల్టీ జోన్–1 నుంచి బదిలీపై వచ్చారు. రూరల్ ఎస్సై సాయికుమార్, ఇతర ఎస్సైలు పుష్పగుచ్ఛం అందించి సీఐకి స్వాగతం పలికారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నర్సాపూర్(జి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీటీ వాహీదొద్దీన్, ఆర్ఐ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత


పాఠశాలకు టీవీ అందిస్తున్న రవిజాదవ్

భైంసారూరల్: విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని మాటేగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని మాటేగాం ప్రాథమిక పాఠశాలలో 12 ఏళ్లు పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సురేశ్వర్, అపర్ణ, షాహిదా, పర్వీన్‌ను సత్కరించారు. ఇదే పాఠశాలకు బదిలీపై వచ్చిన రవిజాదవ్ రూ.26వేల విలువైన టీవీ అందించారు. లక్ష్మణ్‌రావు, మధుసూధన్‌రెడ్డి, వెంకటేశ్, భోజన్న, ఉపాధ్యాయులు రజిని, భూమేశ్, స్రవంతి ఉన్నారు.

సోయాబీన్ పంట పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామంలో సోయాబీన్ పంటలను శుక్రవారం ఏఈఓ స్రవంతి పరిశీలించారు. పంటలో అధిక తేమ శాతంతో కాండపు ఈగ ఉధృతి పెరుగుతుందని గుర్తించారు. ఈ పురుగు నివారణకు క్లోరాంత్రనిప్రోల్ 0.3మి.లీను లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. రైతులు భూమేశ్, గణేశ్, పాండు, ఏఈఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతల సంబురాలు

భైంసారూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని కోతల్‌గాం లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాదిగ సంఘం అధ్యక్షుడు గంగారాం, శంకర్, సంబు, సురేశ్, తుకారాం తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు ఎస్సై సాయం

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన మిర్యాల లక్ష్మణ్–సునంద దంపతులకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సక్రియానాయక్ తన వంతుగా రూ.వెయ్యి, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు ఉన్నారు.

బురద తొలగింపు

కుంటాల: మండలకేంద్రం శివారులో ప్రాణహిత–చేవెళ్ల కాలువపై నిర్మించిన వంతెన వద్ద వర్షాలకు బురదమయంగా మారింది. రోడ్డంతా చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన ఎస్.కే.ఖదీర్, ఎస్.కే.అజాం డబ్బులు వెచ్చించి జేసీబీ సాయంతో బురద తొలగించారు.

నాందేవ్ మహరాజ్ పుణ్యతిథి

లోకేశ్వరం: మండల కేంద్రంలోని మేరుసంఘ భవనంలో నాందేవ్ మహరాజ్ పుణ్యతిథిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. మేరు సంఘం సభ్యులు గంగాధర్, శివకృష్ణ, సాయన్న, శివరాం, వినోద్, సాయినాథ్, రాజు, భూమేశ్, గంగాధర్ ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని మేరుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాందేవ్ మహరాజ్ పుణ్యతిథి నిర్వహించారు. స్థానిక సంఘ భవనంలో నాందేవ్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి కొట్టూర్ సాయినాథ్, గందేవార్ సాయినాథ్, సభ్యులు, మేరు కులస్తులు ఉన్నారు.

అమ్మవారి ఉత్సవాలు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. తిమ్మాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో శాంతినగర్‌కాలనీ నుంచి ఓడి బియ్యం, పట్టువస్త్రాలతో ఆలయానికి వచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు బీసీ రాజన్న, ద్యావతి రాజేశ్వర్, లక్ష్మణ్, రాములు తదితరులు ఉన్నారు.

బాసరలో భక్తుల అవస్థలు

- పనిచేయని ఏటీఎం
- అమ్మవారి ఆలయంలో ఆన్‌లైన్ సేవలు అమలు చేయాలని వేడుకోలు
- కమీషన్ తీసుకుంటూ నగదు ఇస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



ఆలయ ప్రాంగణంలో పనిచేయని ఎస్‌బీఐ ఏటీఎం

బాసర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి నిత్యం వేల మంది తరలివస్తుంటారు. కానీ ఆలయంలో ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, పూజలు, అభిషేకం అర్చన వివిధ సేవ టికెట్ల కోసం నగదు మాత్రమే చెల్లించాలి. ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో చేతిలో నగదు లేనివారు అవస్థలు పడుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎంలో ఎప్పుడు నో క్యాష్ బోర్డే దర్శనమిస్తుందని భక్తులు, స్థానికులు వాపోతున్నారు. అప్పుడప్పుడూ డబ్బులు ఉన్నప్పటికీ ఏటీఎం మిషన్ మొరాయిస్తుందని పేర్కొంటున్నారు.

ప్రైవేటు వ్యాపారులదే హవా..

ప్రస్తుతం చిరువ్యాపారులు కూడా ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్కానర్లను ఉపయోగించుకుంటూ తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. సామాన్యులు సైతం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటివి వినియోగిస్తున్న రోజులివి. కానీ రాష్ట్రంలోనే పేరుగాంచిన బాసర ఆలయంలో మాత్రం ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేవు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేటు వ్యాపారులు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. తమ వద్ద సరిపడ నగదు లేకపోవడంతో భక్తులు ప్రైవేటు ఫైనాన్షియల్ యజమానుల నుంచి కమీషన్ ఇస్తూ నగదు తీసుకుంటున్నారు.

సమస్య పరిష్కరించాలి..

ఇప్పటికైనా ఆలయ అధికారులు, బ్యాంకు సిబ్బంది దృష్టి సారించి ఆలయ పరిసరాల్లో ఏటీఎంలు ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు, స్థానికులు వేడుకుంటున్నారు.

ఏటీఎం పనిచేయక ఇబ్బందులు



మాది హైదరాబాద్.. మా బాబుకు శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో అక్షరాభ్యాసం చే యించేందుకు బాసర వచ్చాం. మా దగ్గర నగదు లేకపోవడంతో ఇబ్బంది పడ్డాం. ఏటీఎం వద్దకు వెళ్తే పనిచేయడం లేదు. మళ్లీ కమీషన్ ఇచ్చి వ్యాపారుల వద్ద నగదు తీసుకున్నాం. ఆలయంలో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తేవాలి.

– శివాని, భక్తురాలు, హైదరాబాద్

నగదు కోసం వ్యాపారులను ఆశ్రయిస్తున్నాం



అమ్మవారి దర్శనానికి రోజు వేలసంఖ్యలో వస్తుంటారు. దేవస్థానంలో ఆన్‌లైన్ సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయం వద్ద ఉన్న ఏటీఎంలో డబ్బులు లేక ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నాం. దీంతో రూ.వెయ్యికి రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా కమీషన్ తీసుకుంటున్నారు. ఆలయ ఈవో, బ్యాంకు మేనేజర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– బలగం శైలేశ్, బాసర

నూతన మిషన్ ఏర్పాటు చేస్తాం

ప్రస్తుతం ఉన్న ఏటీఎం టెక్నికల్ ప్రాబ్లంతో పనిచేయడం లేదు. నూతన ఏటీఎం మిషన్‌ను ముంబై నుంచి తెప్పిస్తున్నాం. అది రాగానే ఏర్పాటు చేసి భక్తులకు, ఖాతాదారులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– అశోక్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజర్, బాసర

విద్యుత్ సమస్యల పరిష్కారానికే పొలంబాట


మామడలో స్తంభం సరిచేస్తున్న సిబ్బంది


దిలావర్‌పూర్‌లో పనులు చేస్తున్న సిబ్బంది

దస్తురాబాద్: సమస్యల పరిష్కారానికే విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమం చేపట్టినట్లు ఖానాపూర్ ఇన్‌చార్జి ఏడీఈ కౌట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని భూత్కూర్ పంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామంలో విద్యుత్ సిబ్బంది పొలంబాట నిర్వహించారు. వేలాడే తీగలు, వంగిన స్తంభాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన రైతులకు సూచించారు. సబ్ ఇంజినీర్ నాగరాజు, సిబ్బంది చరణ్‌దాస్, ప్రేమ్, సదానందం, రాజు తదితరులున్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది పొలంబాట నిర్వహించారు. రైతులతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలు తొలగించి తీగలను సరిచేశారు. లైన్‌మెన్ సంతోష్, ఏఎల్ఎం సంతోష్, సిబ్బంది, గంగన్న, సందీప్ పాల్గొన్నారు.

ఖానాపూర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికే విద్యుత్‌శాఖ–రైతు పొలంబాట కార్యక్రమం చేపట్టినట్లు ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో పర్యటించారు. రైతులు ఆటోమెటిక్ స్టార్టర్లు తీసేయాలని సూచించారు. పెద్ది నర్సయ్య, ఆకుల రాజేశ్వర్, సార్ల నర్సయ్య, రాములు, సిబ్బంది రమణ, శ్రీనివాస్, సంజీవ్ తదితరులున్నారు

మామడ: మండలకేంద్రంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. పంట చేల వద్ద ప్రమాదకరంగా ఉన్న తీగలను సరిచేసి విద్యుత్ స్తంభాలను అమర్చారు. ఏఈ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెంబి: మండలంలోని నాగాపూర్‌లో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట నిర్వహించారు. ఆటోమోటిక్ స్టార్టర్లతో కలిగే నష్టాలను వివరించి.. కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజినీర్ శాంసుందర్, లైన్‌మెన్ సత్యం, దివాకర్, సిబ్బంది ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్, బాబాపూర్ గ్రామాల్లో విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట నిర్వహించారు. ఏఈ మహేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది పొలాల్లో వంగిన స్తంభాలను, ప్రమాదకర తీగలను సరిచేశారు. లైన్‌మెన్ చక్రపాణి, జెఎల్ఎం రవి తదితరులు ఉన్నారు.

కడెం: విద్యుత్ అధికారులు మండలంలోని పాండ్వాపూర్ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మోటార్లు కాలిపోకుండా కెపాసిటర్లు బిగించుకోవాలని రైతులకు సూచించారు. ఏఈఈ టి.సుమన్‌కుమార్, సబ్ ఇంజినీర్ స్వాతి, రైతులు పీవీరావు, మహేందర్, మల్లేశ్ పాల్గొన్నారు.

సమన్వయ లోపం.. ప్రజలకు శాపం

- కడెం తహసీల్దార్ వేధిస్తున్నారని విధులు బహిష్కరించిన సిబ్బంది
- నిలిచిన కార్యాలయ సేవలు
- గంటల తరబడి నిరీక్షించిన ప్రజలు
- విచారణ చేపట్టిన ఆర్డీవో
- తహసీల్దార్‌ను సెలవుపై పంపిన కలెక్టర్


కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు


కార్యాలయానికి వచ్చిన ఆర్డీవో రత్నకల్యాణి

కడెం: తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది మధ్య సమన్వయ పోరు రెండో రోజుకు చేరింది. కడెం తహసీల్దార్ సుజాత తమను వేధిస్తున్నారని కార్యాలయ సిబ్బంది మూకుమ్మడిగా సెలవు పెట్టారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చిన రెవెన్యూ సిబ్బంది విధులకు దూరం ఉండి నిరసన తెలిపారు. అల్లంపల్లి, ఇస్లాంపూర్ తదితర మారుమూల అటవీ గ్రామాల రైతులు ఎంజాయ్‌మెంట్ పత్రాలపై డీటీ, ఆర్ఐ సంతకాల కోసం వచ్చి సాయంత్రం వరకు నిరీక్షించారు. రెండు రోజులుగా కార్యాలయానికి వస్తూ వెళ్తున్నామని వాపోయారు. వీరితోపాటు వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు సిబ్బంది విధుల్లో లేరని తెలుసుకుని నిరాశగా వెనుదిరిగారు.

ఆర్డీవో విచారణ..

తహసీల్దార్ సుజాత రెవెన్యూ సిబ్బంది సమన్వయ లోపంపై ఆర్డీవో రత్నకల్యాణి విచారణ చేపట్టారు. కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ సుజాతతోపాటు డీటీ శంకర్, ఆర్ఐలు లక్ష్మణ్, తక్కన్న, సీనియర్ అసిస్టెంట్ నాగోరావు, జూనియర్ అసిస్టెంట్లను వేర్వేరుగా విచారించారు. సమన్వయ లోపంతో విభేదాలు తలెత్తాయని తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే కార్యాలయాన్ని సందర్శించానని చెప్పారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. సిబ్బంది అందరూ విధుల్లో చేరారని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్‌ను సెలవుపై పంపి డీటీ శంకర్‌ను మూడు రోజులపాటు ఇన్‌చార్జి తహసీలార్‌గా నియమించామని వివరించారు.

సంక్షిప్త వార్తలు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

తానూరు: పెండింగ్‌లో ఉన్న బిల్లులు, తమకు వేతనం చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో వేతనం అందక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 ఉంటే తమకు ప్రభుత్వం మాత్రం రూ.5 మాత్రమే అందిస్తుందని పేర్కొన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: తమకు పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. లింగవ్వ, భోజవ్వ, మంగవ్వ, ఆశవ్వ, లచ్చవ్వ, లక్ష్మి, జంగుబాయి తదితరులున్నారు.

బ్యాగులు,నోట్‌బుక్‌ల పంపిణీ

దిలావర్‌పూర్: మండలంలోని మాయాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నిర్మల్‌కు చెందిన వైద్యుడు దేవేందర్‌రెడ్డి శుక్రవారం బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ అధ్యక్షురాలు పుష్పల, ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు సురేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శుక్రవారం బ్లూకోర్ట్ పోలీసులు బాధితుడికి అందజేశారు. బ్లూకోర్ట్ సిబ్బంది అనిల్, గణేశ్, తిలక్, భాస్కర్ గురువారం అర్ధరాత్రి శివాజీచౌక్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రూ.14 వేల విలువైన ఫోన్ దొరికింది. దానికి వచ్చిన కాల్ ఆధారంగా బాధితుడు దేవేందర్‌కు అప్పజెప్పారు.

బ్యాంకు మేనేజర్‌కు వినతి

సోన్: తమ రుణం మాఫీ కాలేదని మండల కేంద్రానికి చెందిన రైతులు శుక్రవారం ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని పేర్కొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ ప్రసాద్‌రెడ్డి, కొంతం కాంతయ్య, చిట్యాల నర్సయ్య, కొత్తకాపు లింగయ్య, గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్ విద్యలో ప్రవేశాలు ప్రారంభం

లక్ష్మణచాంద: ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు లక్ష్మణచాంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమీపంలోని మీ సేవా కేంద్రంలో చేసుకున్న దరఖాస్తులను పాఠశాలలో అందించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామానికే చెందిన లాయర్ షేర్ నరేందర్ శుక్రవారం పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. కోతులు, కుక్కల బెడద ఎక్కువైందని.. పశువులు సైతం రోడ్లపై తిరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

కుంటాల: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొనికెన వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో జలన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పునరుద్ధరించాలని నిరసన

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ టూ ఖానాపూర్ మార్గంలోని రెంకోనివాగు వద్ద ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డును పునరుద్ధరించాలని కోరుతూ వాహనదారులు నిరసన వ్యక్తం చేశారు. రెండు మండలాలకు చెందిన 20 గ్రామాల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాలేరి రమేశ్, నరేశ్, వెంకటేశ్, శేఖర్, మహేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

సభకు తరలిన ఉపాధ్యాయులు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సీఎం కృతజ్ఞత సభకు ఖానాపూర్ నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. షేక్‌హుస్సేన్, రమేశ్, ఇమ్రాన్, వెంకట్‌రావు, కిషన్, రాజశ్రీనివాస్, మహేశ్ తదితరులున్నారు.

రైతుల అభ్యున్నతికి సహకారం అందిస్తాం


కుంటాలలో డీసీవోను సన్మానిస్తున్న సిబ్బంది

కుంటాల: రైతుల అభ్యున్నతికి సహకారం అందిస్తామని జిల్లా సహకార అధికారి పల్లె పాపారావ్ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో ఎరువులు, రుణాలు అందించాలని ఆదేశించారు. జగదీశ్, ఆడిటర్ ఫిరోజ్‌ఖాన్, కార్యదర్శి నాగభూషణం, సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, భోజేందర్, మహేశ్ ఉన్నారు.

మిర్జాపూర్‌లో పీఏసీఎస్ తనిఖీ

భైంసాటౌన్: పట్టణంలోని మిర్జాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని జిల్లా సహకార అధికారి (డీసీవో) పాపయ్య శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం సభ్యులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ లస్మన్న, అధికారులు ఫిరోజ్‌ఖాన్, జగదీశ్, సీఈవో రాజేందర్, సిబ్బంది ఉన్నారు.

దిలావర్‌పూర్‌లో పారిశుధ్య చర్యలు

సాక్షి స్పందన


ఆయిల్ బాల్స్ వేస్తున్న పంచాయతీ సిబ్బంది

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దీనిపై ఈనెల 2న సాక్షిలో విజృంభిస్తున్న జ్వరాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వార్డుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. దోమలవ్యాప్తిని అరికట్టేందుకు నిల్వనీటిలో బ్లీచింగ్‌పౌడర్ చల్లించి ఆయిల్‌బాల్స్ వేయించారు. కార్యదర్శి మాట్లాడుతూ ఓపెన్‌ప్లాట్ల యజమానులకు నోటీసులు అందించి పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పరిసరాల్లో నిల్వ నీటిని తొలగించండి


మల్లాపూర్‌లో నిల్వనీటిని పారబోయిస్తున్న సిబ్బంది

నిర్మల్‌టౌన్: వ్యాధుల బారిన పడకుండా పరిసరాల్లో నిల్వనీటిని తొలగించాలని మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. నిర్మల్‌లోని 14వ వార్డులో ఫ్రైడే డ్రై డేలో భాగంగా శుక్రవారం మున్సిపల్ సిబ్బంది డ్రెయినేజీలను శుభ్రం చేసి నీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, అజారుద్దీన్, శంకర్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్, పార్‌పెల్లి తదితర గ్రామాల్లో ఫ్రై డే డ్రై డే నిర్వహించారు. వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఇళ్లకు వెళ్లి నిల్వనీటిని పారబోయించారు. అంగన్‌వాడీ టీచర్ లలిత, వైద్య సిబ్బంది ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య చర్యలను ఎంపీడీఓ అరుణారాణి పరిశీలించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్యారోగ్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈజీఎస్ సిబ్బంది పనితీరు మార్చుకోండి

- డీఆర్డీవో విజయలక్ష్మి


పెర్కపల్లెలో కోళ్ల యూనిట్ పరిశీలిస్తున్న డీఆర్డీవో

దస్తురాబాద్: పనులు చేయించడంలో ఉపాధిహామీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. పనితీరు మార్చుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం దస్తురాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండంలోని బుట్టాపూర్, పెర్కపల్లె గ్రామాల్లో గ్రామ సమాఖ్య సంఘాలతో నిర్మించిన కోళ్ల షెడ్డు యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం గంగన్న, ఏపీవో రవిప్రసాద్, గ్రామ సమాఖ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భైంసాటౌన్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని ఆ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా ఆష్టాకు చెందిన ఇందూరి రాజుకు రూ.52,815, భైంసాకు చెందిన ఆసియా ఖానంకు రూ.44,261, రువ్వికి చెందిన జాదవ్ బన్సీలాల్‌కు రూ.1,80,501, ఎడ్‌బిడ్‌కు చెందిన సాయన్నకు రూ.96,292, తరోడకు చెందిన సమీఉల్లా ఖాన్‌కు రూ.1,04,881, గడ్‌చాందకు చెందిన ఎం.చిన్నయ్యకు రూ.2,41,396, మోహలకు చెందిన డి.సాయన్నకు రూ.91,770, ధార్‌కుభీర్‌కు చెందిన పాపన్నకు రూ.2,53,823, నిగ్వాకు చెందిన శివంరెడ్డికి రూ.1,29,905, లింబా(బి)కి చెందిన మందోల్ల పెద్దమ్మాయికి రూ.95,875, భైంసాకు చెందిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు రూ.81,650 విలువైన చెక్కులను అందించారు. శంకర్ చంద్రే, ఓంప్రకాశ్ లడ్డా, ఆ పార్టీ మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన మంద చిన్నయ్యకు రూ.60వేలు, మోహళ గ్రామానికి చెందిన సాయన్నకు రూ.40వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. శుక్రవారం భైంసాలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ వారికి చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ లోకేశ్వరం మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్, సుధీర్‌రెడ్డి, వెంకట్‌రావు, సాయిప్రసాద్, మహ్మద్ షఫీ, నరేశ్, నవీన్ ఉన్నారు.

తల్లిపాలతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం


దస్తురాబాద్‌లో మాట్లాడుతున్న వైద్యుడు నాగరాజు

దస్తురాబాద్: తల్లిపాలు తాగిస్తేనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని దస్తురాబాద్ పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లాపూర్, బుట్టాపూర్, దస్తురాబాద్ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ టీచర్లు సుగుణ, రత్నమాల, భారత, రేఖ, ప్రమీ, ఆశాకార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు గంగామణి, రత్నమాల, భాగ్యలక్ష్మి, సునీత, రాజమణి, వెంకటలక్ష్మి, పద్మ, లలిత పాల్గొన్నారు.

మామడ: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు అందించాలని మిషన్‌శక్తి ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు శైలజ అన్నారు. ఆదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల, పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు, ఓలాలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మిషన్‌శక్తి జెండర్ స్పెషలిస్ట్ జ్యోతి మాట్లాడుతూ మహిళల హక్కులు, ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు బబిత, సుజాత, వీవోఏ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు ఫర్జానా, గంగాజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి అంగన్‌వాడీ కేంద్రం–2లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సులోచన ఉన్నారు.